నందకిశోరరావు చోడవరం మన్నెంలోస్కూళ్ల డిప్యూటీ ఇనస్పెక్టరుగా పనిచేస్తున్నాడు. రేంజియొక్క హెడ్‌క్వార్టర్సు ఏలేశ్వరం. ఇనస్పెక్టరుతో పరిచయమున్న సింహాద్రిరావు, స్వస్థలమైన కాకినాడనుంచి బయలుదేరి, స్నేహితుడైన నందకిశోరరావు ఊరిలో లేక కమానువల్లగా "ఇంటిదగ్గిరనుంచి బయలుదేరిన వేళ మంచిది కాదు" అనుకొన్నాడు. ఇనస్పెక్టరు కమానునుంచి ఎప్పుడు వస్తాడో తెలియదు! మిత్రుడితో సరదాగా కాలక్షేపం చేదామని అతను వచ్చాడు. కాని మిత్రుడు లేకపోగా ఏమీ తోచలేదు. సరదాకోసం వచ్చినవాడు తిరిగి ఊరికే వెళతాడా? ఇంటిదగ్గర తొందర పనులేమి ఉన్నాయని! అతను ఆలోచన చేశాడు. "స్నేహితుడు ఊళ్ళో లేకపోడమే బాగుంది. ఇప్పుడు రెండు కలిసివస్తాయి. నేను వెళ్లి అతనిని కమానులోనే కలుసుకుంటాను. ఇంటిదగ్గిరకన్న కమానులో అయితే మరింత కులాసాగా కాలక్షేపమవుతుంది. నాకు లోకానుభవం పూర్తిగా ఉంది. కాని ఆ శ్రీరామాదుల కున్న వనవాసానుభవం లేదు. ఇప్పుడు కాకపోతే మరి అడివిని చూడడమెప్పుడు కలిసివస్తుంది? ఈ అదను పోగొట్టుకొంటానా! ఎంత మాట! వెళ్లి అతను ఏ ఊళ్ళో ఉంటే ఆ ఊళ్ళో కలుసుకొంటాను. మా మిత్రుడు కూడ ఎంతో ఆనందిస్తాడు. అతనికి తిరుగుడులో ఉండే బాధ తొలగిపోతుంది" అని.

అతను డిప్యూటీ ఇనస్పెక్టరుఅఫీసుకి వెళ్లి ఆ నేడికి ఇనస్పెక్టరు ఏ ఊళ్ళో ఉండవచ్చో కనుక్కున్నాడు. పైగా, అక్కడికి వచ్చిన ఉపాధ్యాయులనుంచి కొంత భోగట్టా లాగాడు. శరభాపురంలో ఉండవచ్చని తెలుసుకొని సాహసించి అక్కడికి వెళ్లదలచాడు. మన్నెంలో ఊళ్లు తిరగడమంటే

తమాషా కాదు. ఆ వైపు మన్యాని కంతకి ఒకే ఒక కంకరరోడ్డు ఉంది. ఆ దారిని బస్సు కూడా వెళ్లుతుంది. బళ్ళదారులు లేని ఊళ్లు కూడా ఉన్నాయి. గాజుల తట్లు అంటే గుర్రాలమీద వెళ్లవలసిన ఊళ్లూ ఉన్నాయి. కాలినడకకి కూడా గతి లేని ఊళ్లూ ఉన్నాయి. సింహాద్రిరావు ఇంకో గంటలో, అంటే మధ్యాహ్నం బయలుదేరే బస్సులో, వెళ్లదలుచుకొన్నాడు. కాఫీ హోటెలులో కాస్త కతికి, బస్సుస్టాండుకి వచ్చాడు. అప్పటికింకా బస్సు రాలేదు. కాలక్షేపానికి కిళ్లీ నములుతూ, సిగరెట్టు పీలుస్తున్నాడు.

సింహాద్రిరావు సన్నగా ఎర్రగా ఉంటాడు. పాతిక ఏళ్లు. కళ్లు పెద్దవి. మధ్య మధ్య బిత్తరచూపులు చూస్తూంటాడు. కొంచెం నవ్వు మొహం. సన్నని మీసం. చిన్న పిలక ఉంది కాని బయట పెట్టడు. ముందు క్రాపింగు. దేశీయదిరీసు వేసుకొన్నాడు. కాస్త షోకు జమాయిద్దామని రంగు వెలసిపోయిన కోటు ఒకటి ధరించాడు.

బస్సు వచ్చింది. సింహాద్రిరావు ముందు సీటులో చోరవ చేసి కూర్చున్నాడు. బస్సు నడక సాగించగా కాస్త నోరున్నవాడు కాబట్టి దారిలో బస్సు ఎక్కిన ప్రతివాడిని కూడ 'డిప్యూటి ఇనస్పెక్టరుగారు ఎక్కడ మకాం చేశారు. ఏమిటి కథ అని కనుక్కొంటూ సాయంత్రానికి శరభాపురం చేరుకొన్నాడు.

అతని అంచనా చక్కగా ఫలించింది. లేకపోతే పాపం ఈ అడివిలో ఎక్కడెక్కడ తిరగవలసివచ్చేదో, ఏమి గతో! ఇనస్పెక్టరు శరభాపురంలోనే ఉన్నాడని విని నేను కొంత పుణ్యం చేసుకొన్నాను" అని సంతోషించాడు.

నందకిశోరరావు బడి పరీక్ష చేసుకొన్నాడు. కుర్చీమీద కూర్చున్నాడు. సింహాద్రిరావుని చూసీ చూడడంతోనే ఇనస్పెకరు ఆశ్చర్యపోయాడు. "నువ్వు అసిస్టెంటు ఏజెంటు తాతలాగున్నావే!" అన్నాడు.

"నేను పాతికేళ్ళవాణ్ణి, తాత నెలాగు అవుతానయ్యా!" అన్నాడు సింహాద్రిరావు.

"అరి నీతస్సల మందు! మేము మన్నెంలో ఎక్కడ ఉన్నా సరే" అసిస్టెంటు ఏజెంటు ఇట్టే పట్టేస్తాడు. నలుగురిని నాలుగు మూలలా పంపిస్తాడు. వల వేస్తే పిట్ట దొరికినట్టు దొరికిపోతాం. నువ్వా మని షివంటే! ఈ అడివేమిటి! ఈ మన్నెమేమిటి! ఈ కొండ లేమిటి! ఇక్కడి తిండి తిప్పలేమిటి!" అంటూండగా సింహాద్రిరావుకూడా అందుకొని "ఇక్కడి దారులేమిటి! ఇక్కడి మనుష్యులేమిటి! ఇక్కడి ఆఫీసర్లేమిటి!" అన్నాడు.

"నువ్వు బాగా కుదిరేవు లేరా!" అన్నాడు ఇనస్పెక్టరు.

"నేను పిలవకుండానే వచ్చానుగా!" అన్నాడు సింహాద్రిరావు.

పిలవకుండా వచ్చినవాళ్ళే ఇక్కడికి కావాలి. మన్నెం అంటే మజాకా అనుకొంటున్నావేమో! ఇక్కడివాళ్లే హడిలిపోతారు. రాజబాటని పోతూంటేనే ఏ పెద్దపులి మీద పడుతుందో, ఏ ఎలుగుగొడ్డు తరుముతుందో అని! సరే! మాటలు తర్వాత కానిద్దాం గాని" అని పక్కనే ఉన్న ఉపాధ్యాయుడి వైపు చూసి "కాస్త కాఫీ ఉంచారా?" అన్నాడు.

"మరుగుతూంది" అన్నాడు ఉపాధ్యాయుడు.

ఫలహారంసమేతం కాఫీ పుచ్చుకున్నారు అతిథులిద్దరున్నూ.

సింహాద్రిరావు గ్రురున తేన్చి, సిగరెట్టు ముట్టించి, బడిఇంటిని చూసి నిర్ఘాంతపోయాడు. అదొక తాటాకుల పాక. మన్నెంలో వెదుళ్లకి లోప మేమిటి! తాటాకులకి లోపం అంతకన్నా లేదు. అలాంటి పాకలు ఒక్కసారిగా పాతిక వెయ్యవచ్చు. వేసీ,మనుష్యులు దొరకాలి గాని! మట్టి నేల! గోడలే నేలేగు. అయితే ఒక విశేష మేమిటంటే, పాకలో ఒకవైపు నాలుగు బద్దలు అల్లి ఒక చిన్న గదిలాగు అమర్చబడింది. నామకః గది. ఆ బద్దలమధ్య నుంచి కావలిస్తే ఏ అడవిపందో, ఏ చిరుతపులో దూరవచ్చు. దానికి ద్వారం ఉంది కాని తలుపు లేదు. అందులో ఎవరేనా కాపుర ముంటారా ఏమేనా! పగటిపూట నలుగురు పిల్లలు చేరితే చేరతారు. అంతే! ఒక మేజాబల్ల, ఒక కుర్చీ, నాలుగు పొడుగుపాటి బెంచీలు, ఒక నల్లబల్ల అనబడే తెల్లబల్ల, ఇవే అక్కడ ఉండే సరంజామా.

బడికి ఆనుకొనే అడివి ఉంది. ఇక్కడి పరిస్థితులు చూసి సింహాద్రిరావుకి ఒకవైపు గుండె బితుకు బితుకు మంటూంది. నేరక పోయి ఇక్కడికి వచ్చేనని మనస్సులో అనుకొన్నాడు కాని అంతటిలో వెల్లిపడిపోయే ఘటం కాదు.

నూక్కలు పెరడే జీమూతంలాగు ఉంది. కాలు అవతల పెడితే ఏ పాము కేస్తుందో అనిపిస్తూంది.

ఇక్కడి సంగతులు చూసి సింహాద్రిరావు "ఇది పెరడా, నందన వనమా, యమలోకమా?" అని ఉచ్చరించాడు.

"మేష్టరూ! నువ్వే చెప్పు. ఇదంతా నీ సామ్మేకదా?" అన్నాడు ఇనస్పెక్టరు.

"ఏమిటోనండి! చెట్లు ఒకవైపు కొడతూంటే ఒకవైపు పెరిగిపోతుంటాయండి!' అన్నాడు ఉపాధ్యాయుడు నిరుత్సాహంగా.

"ఒకవైపు తింటూంటే ఒకవైపు అరిగిపోతూంటుందండి" అన్నాడు సింహాద్రిరావు, సిగరెట్టు పొగ విడుస్తూ. మిత్రుడితో "ఇంతకీ రాత్రిభోజన ముందా! అని ప్రశ్నించాడు.

"దుప్పిభోజనాని కేమీ లోటు లేదు" అన్నాడు ఇనస్పెక్టరు.

"హరి! చచ్చాం! రాకరాక వచ్చిన అతిథిగతి ఇదా!" అన్నాడు సింహాద్రిరావు.

"నాతోపాటు మేతకి ఫర్వాలేదు. కుక్కరుమీద పడేస్తాను లే" అన్నాడు ఇనస్పెక్టరు. మునిమాపు అవుతూంది కదా అని అతను కుక్కరుకోసం తొందరపడుతున్నాడు. బంట్రోతు సాయం చెయ్యడంకోసం సిద్ధపడ్డాడు.

"మంచి పోటాకత్తి తెప్పించిపెట్టు పంతులూ! అన్నాడు సింహాద్రిరావు ఉపాధ్యాయుడితో"

"ఒకటి కాకపోతే రెండు తెప్పించుతాను" అని పంతులు, దగ్గిర వున్న యిద్దరి శిష్యులిని పంపించాడు. వాళ్లు కత్తి ఒకటి తెచ్చారు.

ఎవరి ఇంటి దడిమీదో కాసిన రెండు పొట్లకాయలు సాధించుక వచ్చాడు పంతులు. వాటిని చూసి బ్రహ్మానందపడ్డారు మిత్రులు. "ఈ అడివిలో ఇవెక్కడ పుట్టించుకువచ్చావయ్యా!" అన్నాడు ఇనస్పెక్టరు.

"తమ దయ" అన్నాడు పంతులు.

బంట్రోతు సాయంచేయగా కుక్కరు పనితో తంటాలుపడుతున్నాడు నందకిశోరరావు.

సింహాద్రిరావు పెరటిలోకి వెళ్ళాడు. "ఈ పెరటిలో చెట్లన్నీ ఛేదించిపారేస్తాను" అని లేచి వెళ్లి, మళ్ళీ వచ్చి, కోటు తీసి ఒక వెదురుబద్దకి తగిలించి, నడుం బిగించాడు. ఒక సీతాఫలంచెట్టు కొమ్మని కత్తితో రెండు దెబ్బలు వేశాడు. అతని నెత్తిమీద రకీమని మేకుతో పొడిచినట్లయింది. అటు వెతికాడు ఇటు వెతికాడు. ఎటు వెతికినా ఏమీ కనపడకపోగా "ఇది దయ్యమా! భూతమా!" అను

కొన్నాడు. నొప్పి విపరీతంగా ఉంది. అర్థం కాకపోగా మళ్లీ కొమ్మని రెండు దెబ్బలు వేశాడు. మళ్లీ నెత్తిమీద మేకు దిగకొట్టినట్లయింది. ఆశ్చర్యంతోపాటు హడలిపోయాడు. నెత్తిమీద ఒక పెద్ద కందిరీగ చప్పుడులేకుండా ఎగురుతూంది. "అమ్మో! నువ్వా!" అనుకొన్నాడు. కాస్త జాగ్రత్తగా చూసేటప్పటికి ఆ కొమ్మని కందిరీగల తెట్టె ఉంది. దానిలోంచి కందిరీగలు బయలుదేరివస్తున్నాయి. కత్తి అక్కడ పారవేసి 'బతుకు జీవుడా' అంటూ, పరుగెత్తుకొనివచ్చి పాకలో పడ్డాడు. అతను పంతులుతో "ఆ చెట్టుని కొడుతోంటే కాస్త చెప్పవద్దటయ్యా, మాబోటి దూరదేశస్థులకి ఏం తెలుస్తుంది! ఈ ఊరంతా కొత్తకదా! మాకేది వచ్చినా పూచీ నీదే కదా!" అన్నాడు.

"అదేమిటండి బాబూ" అని ఉపాధ్యాయుడు ఆశ్చర్యంగా చూశాడు.

"నెత్తిమీద చూడు, కందిరీగలు ఎలాగు పొడిచేశాయో! రక్తం వస్తూన్నట్టుంది!" అన్నాడు.

"కత్తి ఎందుకు తెమ్మన్నారో ఏమిటో నాకు తెలియదండి. ఆ చెట్టుదగ్గిరకి మేము అందుకనే పోమండి! అయ్యో! పాపం!" అని అతను విచారించి, చెట్టుదగ్గిర పారవేసిన కత్తి తెచ్చుకొన్నాడు.

ఆ ఊళ్లోనే కాపుర ముండి పొరుగూరికి వెళ్లి బడిచదువు చెప్పుకొని తిరిగి వచ్చే ఉపాధ్యాయుడొకడు, ఇనస్పెక్టరుగారు తమ ఊరికి పరీక్షకోసం ఎప్పుడు వస్తారో అడిగి తెలుసుకొందామని వచ్చిన మరి ఇద్దరు ఉపాధ్యాయులు, అక్కడ పోగయారు.

ఇనస్పెక్టరు ఒక కుర్చీమీద కూర్చున్నాడు. సింహాద్రిరావు ఒక బెంచీమీద కూర్చున్నాడు. అతను "ఏమిటి ఈ అడివిలో విశేషాలు?" అని తెలుసుకోడానికి కుతూహలపడ్డాడు.

"అడివి కేముందండి వెధవ అడివి! ఇంత అడివి ఉందన్నమాటేగాని ఇక్కడ తినడానికి మళ్లీ ఎక్కడినుంచో తెచ్చుకోవలసిందేనండి! అంత వ్యవసాయం నేర్చిన వాళ్లు లేరు. ఏవో జొన్నలో, గంటెలో అడివిపందుల నోళ్లు, దుప్పల నోళ్లు కొట్టి కాస్త సంపాదించుకొంటారు. అంతేకాని వరిపైరు చెయ్యలేరండి" అన్నాడు మొదటి పంతులు.

"దాని మాటకేంగాని ఇక్కడుండే పులులు, సింహాలు, ఏనుగులు, శరభ మృగాలు ఇత్యాదుల చిత్రవిచిత్రాలేమిటి?" అన్నాడు సింహాద్రిరావు.

డిప్యూటీ ఇనస్పెక్టరు వింటున్నాడు.

"ఇక్కడ పెద్దపులులు, బండిచిందువులు, ఆకుచిందువులు, ఎలుగుగొడ్లు, దుమ్ములగొండ్లు ఇంట్లాంటివి కావలసినన్ని ఉంటాయండి" అన్నాడు రెండో పంతులు.

"అయితే ఈమధ్య ఎవరేనా పెద్దపులిని చూసేరా, లేకపోతే బోనులో పట్టేరా, లేకపోతే తుపాకితో కొట్టారా? ఏమిటి కథ" అన్నాడు సింహాద్రిరావు.

"మొన్నమొన్ననే ఒకాయన ఇక్కడికి కొత్తగా వచ్చేడండి. ఒక కాబూల్ అబ్బి. వచ్చినవాడు ఊరుకోకుండా పెద్దపులిని చూసి వస్తానని బయలుదేరేడండి, అదేమిటో చెప్పినట్టుగా పెద్దపులి వచ్చిందండి. ఏదో కత్తి అతనిదగ్గిర ఉందికాని దానివల్ల ఏమి లాభం? అతను జడిసి వెనక్కి పోతూంటే పెద్దపులి కిందికి లాగేసిందండి. చంపేసి, తినేసిందండి" అన్నాడు మొదటి మాష్టరు.

డిప్యూటీ ఇనస్పెక్టరు "అయ్యో! పాపం!" అని విచారించాడు.

సింహాద్రిరావు గుండెలలో రాయి పడింది. "ఇక్కడ ఇంతేసి ప్రమాదాలున్నాయా! ఇంకా ఏమిటో అనుకొన్నాను" అని. ఇక్కడినుంచి బతికి వెళ్లే సూత్రమేమిటి అని ఆలోచిస్తున్నాడు. రావడమే పొరపాటు జరిగిందని విచారిస్తున్నాడు.

నాలుగో మేష్టరు మరొక కథ చెప్పాడు. "మన కొక ఫర్లాంగు దూరంలోనే ఒక పొలం దున్నుతున్నాడండి ఒక మన్నెంకాపు. అతను చేతిలో చువ్వ లేదని నాలుగడుగుల దూరంలో ఉన్న చెట్టు కొమ్మని విరుద్దామని వెళ్లి విరచి వచ్చేసరికి కాడి నున్న రెండెద్దులలో ఒకదానిని పులి వీపుమీద వేసుకొని పట్టుకుపోతూందండి. పాపం ఏమిటి చేస్తాడు! అది ఎక్కడ పొంచుందో, ఏమిటో గోలపెడుతూ అతను మిగిలిన పశువుతో కొంపకి చేరుకొన్నాడండి" అన్నాడు.

"ఎంత చిత్రమో! పాపం!" అని విచారించాడు డిప్యూటీ ఇనస్పెక్టరు.

"ఇక్కడికి ఫర్లాంగు దూరంలోనే!" అన్నాడు సింహాద్రిరావు. అతను పై ప్రాణాలు పైకి పోయినట్టుగా కూర్చున్నాడు. ఒక ఉలుకు లేదు, ఒక పలుకు లేదు. తాను ఇక్కడికి రావడమే తప్పు పని చేసే ననుకున్నాడు. "ఇదేమి చావుతో చెలగటమా మరొకటా! ఇక్కడినుంచి బతికి కొంపకి చేరుకొన్నప్పటి మాట చూసుకుందాంలే" అని దిగులుపడిపోయాడు. అతని వాచాలత తగ్గిపోయింది. సిగరెట్టు ముట్టించి ఉట్టినే కూర్చున్నాడు.

బాగా చీకటి పడింది. ఊరు మాటుమణిగింది. పక్షుల అరుపులుకూడ తగ్గిపోయాయి. లాంతరు వెలుగుతూందన్నమాటేగాని, దాని వెలుగుని చీకటి తినివేస్తూంది. స్నేహితులిద్దరూ భోజనానికి కూర్చున్నారు. మన్నెంలో పెరుగు వేసుకోకూడదనుకొంటూ, తినడానికి మరేమిటున్నాయనుకొంటూ, ఆ గట్టిపెరుగుని విడిచిపెట్టలేక వేసుకొని భోజన మయిందనిపించారు.

వాళ్లు చేతులు కడుక్కొంటూండగా కై - కై - కై అని మూడుసార్లు శబ్దం వినపడింది. మొదటి మాటుకంటె రెండో మాటు, రెండోమాటుకంటే మూడోమాటు శబ్దం తగ్గిపోయింది. ఏమిటా అనుకొన్నారు! పక్కనున్న మనుష్యులు కేకలు వేస్తున్నారు. 'ఏమిటి' అని స్నేహితులిద్దరూ కంగారుపడి కనుక్కొంగా, బండిచిందుఒకటి కుక్కని నోటకరచుకొని పారిపోయిందని తేలింది. ఇది తమకి నలభైగజాల దూరంలోనే జరగగా డిప్టీఇనస్పెక్టరు భయపడ్డాడు. కాని చేసేదేమీ లేదు. సింహాద్రిరావు బెంబేరయిపోయి కూర్చున్నాడు. ఒంటిలో ప్రాణాలు లేవు. నోట మాట లేదు. ఏమిటి సాధనం అని ఆలోచిస్తున్నాడు.

పక్కలు వేసుకోవలసివచ్చింది. చుట్టూ చిమ్మచీకటి 'గీ' పెడుతూంది. కన్ను పొడుచుకున్నా అవతలి వస్తువు కనపడదు. స్థలం చూస్తే బహు ప్రమాద మయినది. సింహాద్రిరావుకి ఏమీ పాలుపోలేదు. చివరికి తెగించి "మనం ఎక్కడ పడుక్కోడం?" అని ప్రశ్నించాడు.

"ఎక్కడేమిటి, ఇక్కడే," అన్నాడు ఇనస్పెక్టరు.

"నన్ను బతికించే పూచీ నీది" అని సింహాద్రిరావు నిర్మొహమాటంగా చెప్పివేశాడు.

"నిన్ను నన్నుకూడ బతికించే పూచీ దేవుడిది" అని ఇనస్పెక్టరు జవాబు చెప్పాడు.

ఇద్దరికీ చెరో రెండు బెంచీలు ఉన్నాయి. గదిగుమ్మందగ్గిర తనకి కాపుగా ఇనస్పెక్టరుని బెంచీలు వేసుకొమ్మన్నాడు సింహాద్రిరావు. "ఎక్కడైనా ఒక్కటే!" అన్నాడు ఇనస్పెక్టరు. బంట్రోతు సాయం చేయగా సింహాద్రిరావు రెండు బెంచీలు గదిలోపల వేసుకొన్నాడు. వాటి చుట్టూరా, తనపైనుంచి బట్టలు కప్పి గుడారంలాగ

తయారుచేశాడు. వెయ్యి దేవుళ్లకి మొక్కుకొని కళ్లు మూశాడు.

అతను మెలకువ వచ్చినప్పుడైన కళ్లు తెరవలేదు. ఏమాత్రం అలికిడి అయినా మొట్టమొదట ఇనస్పెక్టరుని ఎత్తుకుపోతుంది ఆ వచ్చిన పెద్దపులి అని భావించాడు. మెలకువ వచ్చినప్పుడు, కలలోనుకూడ అతని మనస్సులో పెద్దపులులు పచారుచేస్తూనే ఉన్నాయి.

ఏలాగో తెల్లవారింది. పక్షులు హడావుడి చేస్తున్నాయి. కాలకృత్యాలు తీర్చుకోడానికి నందకిశోరరావు లేచి వెళ్లాడు. మనుష్యుల శబ్దంకోసం ఎదురుచూస్తున్నాడు సింహాద్రిరావు. అంతవరకు కళ్లు తెరవదలచుకోలేదు.

మేష్టర్లు వచ్చి అతని గుడారం చూసి నవ్వుకొన్నారు. అతన్ని లేవగొట్టారు. మేలుకుని ఉంటే "అమ్మయ్యా!" అంటూ నిద్రలోంచి లేచినట్టుగా లేచి, ఒళ్లు విరుచుకున్నాడు.

"ఇంత భయమైతే ఎలాగండి పంతులుగారూ!"అన్నాడు అందులో ఒక మేష్టరు.

"నాకు భయమంటావా? నేను చేతకానివాణ్ణనుకొన్నావా? ధైర్యం లేనివాణ్ణనుకొన్నావా? మావాళ్లు వీరులు కాదనుకొన్నావా? త్యాగులు కాదనుకొన్నావా? అంటూ చర్రుమని లేచాడు సింహాద్రిరావు.

వాళ్లు మరింత నవ్వుకున్నారు.

అతను మరింత కోపంతో "మీకేం తెలుసు నా ధైర్యం? సమయం వస్తే కొండల్ని పిండిగొట్టేస్తాను. ఏనుగుల్ని తునుమాడేస్తాను. ఎనుబోతుల్ని అవలీలగా ఎత్తిపారేస్తాను. నా పేరు ఏమనుకున్నారో! నా తడాఖా చూశారు కాదు మరి," అన్నాడు.

"ఒక్క పిసరు అబద్ధం లేదు" అన్నాడు అందులో ఒక కొంటె మేష్టరు.

"అలాగు దారిలోకి రండి. ఇది శూరవంశం. ఇది వీరవంశం, ఇది సాహసవంశం. అంతే కాని పిరికికండ మచ్చుకేనా లేదు. అసామాన్యమైనది కాని 'మరొకటి కాదు సుమండీ! మీరు పొరపడుతున్నారు" అన్నాడు సింహాద్రిరావు గంభీరంగా.

"ఏమో తెలియక మావాడు అన్నాడు లెండి! వాడి మాటల కేమిటి, పోనిద్దురూ!" అని సర్ది వేశాడు ఇంకొక మాష్టరు.

"తెలియక అన్నాడుకాబట్టి క్షమించాను. అదీ మీరు కాబట్టి. మరొకరు, మరొకరు అయితే తీసుకుపోయి పెద్దపులుల మధ్య పారేసి చక్కా వచ్చేవాణ్ణి" అన్నాడు సింహాద్రిరావు, చేతికందని మీసంమీద చెయ్యివేసి. అతడు వీరుడి భంగిమంలో నిలుచున్నాడు.

మన కెందుకీ పిచ్చిబ్రాహ్మడితోటి అని మేష్టర్లు సమయానుకూలంగా ప్రవర్తించడం వల్ల అతను అంతటితో ఊరుకున్నాడు. కాలకృత్యాలు నిర్వర్తించుకొన్నాడు. కాని అతని కడుపులో మండిపోతూంది. "నేను ధైర్యం లేని వట్టి పిరికివాణ్ణి అని ఈ అభాజనులు, ఈ అజ్ఞానులు భావించారు. వీళ్లకి తగినట్టు బుద్ధి చెప్తాను" అని పిడికిళ్లు బిగించాడు. ఇంతటిలో డిప్యూటి ఇనస్పెక్టరు వచ్చాడు.

"ఫలహారానంతరం బండెక్కి కొంకుపల్లి పోదాం" అన్నాడు ఇనస్పెక్టరు సింహాద్రిరావుతో.

"అబ్బే! నేను బండీమీద కూచుంటానా! ఎంత మాట! ఈ అడివేమిటో! ఈ కొండలేమిటో! ఇక్కడి మనుష్యులేమిటో! ఇక్కడి వ్యవహారమేమిటో! ఈ కంటితో చూడడానికి వచ్చాను కాని ఇక్కడికి ఈ ఫలహారాలకోసం, ఈ బళ్లకోసం వచ్చానా?" అన్నాడు సింహాద్రిరావు.

"కాదు. నామాట విను. సుఖంగా బండీమీద పోదాం. మన కెందుకు వచ్చిన బాధ ఇది" అన్నాడు అధికారి.

"అబ్బెబ్బే! వీటి అంతు కనుక్కోవాలి" అని బుర్ర అడ్డంగా ఆడించాడు మిత్రుడు.

"అయితే ఏమిటి చేస్తానంటావు?"

"చక్కగా నడిచి వస్తాను" అన్నాడు సింహాద్రిరావు.

"నీకు దారి ఎలాగు తెలుస్తుంది?"

"మనుష్యుల్ని వెంటపెట్టుకు వస్తాను."

"కాదు నామాట విను సుఖంగా బండీమీద పోదాం."

"ఛీ-ఛీ-ఛీ-ఛీ" అన్నాడు సింహాద్రిరావు.

సింహాద్రిరావు పట్టుదల విడిచిపెట్టేటట్లు తోచలేదు. కాని వట్టి పిరికిపంద అని ఎరిగి ఉద్యోగస్థుడు నలుగురి మేష్టర్లని అతన్ని తోడుకొని రావడానికి ఏర్పాటుచేశాడు.

సింహాద్రిరావు ఒకటి ఆలోచించాడు. నేను అడవిలో వెళ్లేటప్పుడు సిగరెట్టు కాలవను. ఎంచేతంటే, ఆ వాసనకి పసిపట్టి ఏవేనా క్రూరమృగాలు రావచ్చు అని.

డిప్టీ ఇనస్పెక్టరు బండెక్కి వెళ్లిపోయాడు. నలుగురు మేష్టర్లని వెంటపెట్టుకుని సింహాద్రిరావు బయలుదేరాడు. అంతా నాటుదారి. దారిపక్కని ఉన్న అడివి చూస్తున్నాడు. అవతల ఏమిటి కనపడుతుంది! ఆకుపచ్చని గోడ! అడివిలో క్రూరజంతువుల మాట తలపుకి రాగా అతనికి ఒళ్లు గరిపొడిచింది.

"కంటితో చూస్తే భయంకాని లేకపోతే నాకేం భయం" అని, చేతిలో గొడుగు విప్పాడు. మొహానికి అడ్డుగా పెట్టుకున్నాడు. నడక ఏలాగు సాగుతుంది? మరొక ఉపాధ్యాయుడి చెయ్యిపట్టుకొని నడుస్తున్నాడు.

మొదటి ఉపాధ్యాయుడు "గొడుగు

(43-వ పేజీ చూడండి)



మన్నెంలో సాహసాలు

(9-వ పేజీ తరువాయి)

ఏందుకండీ నవ్వారు పంతులుగారూ!" అన్నాడు.

"ఇది మిమ్మల్ని కాపాడుతుంది. దీని మహాత్యం అది" అన్నాడు సింహాద్రిరావు.

"ఎలాగండి?" అని రెండో మాష్టరు ప్రశ్నించాడు.

"ఏదేనా పెద్దపులికనక దీనిని చూసిందంటే, ఇది తనని మింగెయ్యడానికి వచ్చిన మృగసార్వభౌము డని తలచి తోక ముడిచేస్తుంది" అన్నాడు అతను.

"ఇది గొప్ప ఆలోచనే!" అని కళ్లెగరేశాను మెచ్చుకొన్నట్టుగా, మరో ఉపాధ్యాయుడు.

అందరూ నవ్వేశారు.

"నాకు పెద్దపులులంటే భయమనుకొన్నారా? అబ్బే! ససేమిరా! ఎందుకంటారా? వినండి చెప్తాను. నేను చిన్నప్పుడు దసరాపండుగలలో పెద్దపులివేషం వేసేవాణ్ణి, సరదాకి" అని సింహాద్రిరావు చేతిలో గొడుగు కింద పారవేసి, మేష్టర్లని నమ్మించడానికని "జజ్జనక జనక-జజ్జనక జనక-జజ్జనక జనక" అని పులిఅడుగులు వేశాడు "పెద్దపులి కనక నిజంగా ఎదురయిందంటే, నేను దానిలాగు అడుగులు వేసి, బుజా[illegible]ంచి, నేలమీద వాలి పంజా చూపించే[illegible]కి 'ఇంకేం! మనవాడే!' అని దాని దా[illegible]నది చక్కా పోతుంది" అన్నాడు

ఈ ఫార్సు చూసి ఉపాధ్యాయులు పొట్టలు చెక్కలయేటట్లు నవ్వుతున్నారు.

మూడో ఉపాధ్యాయుడు "ఎంత ధైర్యం! ఎంత సాహసం! ఏమి కథ!" అన్నాడు.

సింహాద్రిరావు తన సాహసకృత్యాలు ఒకటి రెండు వర్ణించి చెప్పి, మేష్టర్లకి కలిగిన దురభిప్రాయాన్ని పూర్తిగా పారద్రోలదలచుకున్నాడు. "ఒకమారు ఊరికి వెళుతున్నాను" అన్నాడు అతను.

ఉపాధ్యాయులు శ్రద్ధగా వింటున్నారు.

"వెళుతూంటే దారిలో నక్కపోతు ఎదురయింది. మన కెందుకు పోనీ అని ఎంతసేపు నిలుచున్నా పోదు. చూశాను, చూశాను. చివరికి దానితో చెడుగుడు ఆడేశాను. అదీ నాతో సమానంగా గంతులు వేసింది. ఇహ దీనిని చంపేద్దామని అనుకొంటూండగా మా ఊరివాళ్లు దారిలో కలుసుకొన్నారు. నా ధైర్యం చూసి వాళ్లు 'అపరభీముడు' అని పేరు పెట్టారు" అని ధైర్యశాలిలాగ కనపడ్డాడు సింహాద్రిరావు.

మాష్టర్లు నవ్వుకొన్నారు. అందులో ఒకడు "నక్కపోతు కేమిటి లెండి!" అన్నాడు.

"అయితే మరొకటి చెప్తాను వినండి!" అన్నాడు సింహాద్రిరావు. "మా ఊరికి దూరంగా ఒక అడివి ఉంది. అప్పుడు నాదగ్గిర ఒక తుపాకి ఉండేది. అది బుజాన్ని వేసుకొన్నాను. టక్ టక్ టక్ మని దొరలాగు అడవిలో నడచిపోతూంటే, ఏనుగుకంటె పెద్ద జంతువొకటి ఎదురయింది. దానికి ఎనిమిది కాళ్లున్నాయి. రాతుని తలకాయి. బారెడేసి కొమ్ములున్నాయి. పైగా తొండముంది. కాళ్లని చూస్తే మూరెడేసి గోళ్లున్నాయి. శరభమృగ మంటారు శాస్త్రాలలో. దానిని టప్ మని తుపాకి పేల్చి ఒక్క దెబ్బతో కాల్చేసి, అక్కడే పారేసి నాదారిని నేను చక్కా వచ్చాను" అని వీరుడులాగ కనబడ్డాడు.

"ఇది లేతసొరకాయ కోత. కాకపోతే ఎనిమిది కాళ్లేమిటి!" అన్నాడు రెండో మేష్టరు.

సింహాద్రిరావు చిన్నబుచ్చుకున్నాడు. "మీ రెప్పుడేనా చెన్నపట్టణం వెళ్లేరా?" అని ప్రశ్నించాడు.

"లేదు. మాకు చెన్నపట్నాలు ఎక్కడనుంచి వస్తాయండి!" అన్నాడు నాలుగో మేష్టరు.

"అయితే చెప్తాను వినండి! చెన్నపట్టణంలో ఒకచోట ఆకాశమంత ఎత్తు జంతువు లున్నాయి. అవి పెద్దపెద్ద చెట్ల చివరిఆకులు అంటే కొసలుగాని తినవు. వాటి వ్రతమది. మీరు విన్నారా మరి?" అన్నాడు సింహాద్రిరావు.

"ఏమిటో ఈ చిత్రం" అన్నాడు మూడో ఉపాధ్యాయుడు.

"ఫర్లాంగు పొడుగు జంతువులుకూడ ఉంటాయని పెద్దపెద్ద పుస్తకాలలో రాస్తారు" అన్నాడు సింహాద్రిరావు.

ఉపాధ్యాయులు చిత్రంగా చూశారు.

1 తులముటిన్నులలో అన్నిచోట్ల దొరకును.
శ్రీ అంబాళ్ అండు కంపెని,
తపాలు పెట్టె నెం. 3. మదరాసు.

తెలియని ఉపాధ్యాయులు తనమాటలు నమ్ముతున్నారని అతను సంతోషించాడు.

వాళ్లు దారిలో వాగులలో దిగుతున్నారు, ఎక్కుతున్నారు. ఇసకలో కాళ్లీడ్చుకొంటూ నడుస్తున్నారు. బండరాళ్ల మీద జాగ్రత్తగా వెళుతున్నారు. ముళ్ళకంపలు తొలగించుకొంటున్నారు.

పక్కనున్న డొంకలోంచి పామొకటి పారిపోతూంటే చూసి చెప్పాడు నాలుగో ఉపాధ్యాయుడు. సింహాద్రిరావు కంగారుపడ్డాడు. ఉపాధ్యాయులు నలుగురిని నాలుగు దిక్కులా ఉండమని తాను మధ్యని నడుస్తానన్నాడు. పాపం! వాళ్లు అలాగే చేస్తున్నారు. అప్పుడు వాళ్లకి ఈమోస్తరుగా హితబోధ చేశాడు. "అతిథిని రక్షించడం మీ విధి. ఒకవేళ ఏదేనా క్రూర జంతువు వస్తే మీరు దానిమీద పడిపోవాలి. అంతేగాని వెనక్కి తగ్గకూడదు. అసలు పరిగెత్తి పారిపోకూడదు. పైగా నా తలిదండ్రులకి ఒక్కణ్ణే! నాఒక్కడికీ ఏదేనా వచ్చిందంటే వాళ్లు ఎంత విచారిస్తారో మీరు ఆలోచించుకోండి. నన్నే నమ్ముకొన్న నా భార్యకి వైధవ్యం వచ్చిందంటే మీరు ఎంత పాపం వడిగట్టుకొంటారో ఊహించుకోండి. నా పిల్లల్ని దిక్కులేని వాళ్లనిగా చేస్తే మీకు పుట్టగతులుంటాయా!" అన్నాడు.

ఉపాధ్యాయులు అతని పిరికితనాన్ని చూసి ముసిముసినవ్వులు నవ్వుకొన్నారు.

అతనికి వెనకవైపున ఉండవలసిన ఉపాధ్యాయుడొకడు అతనితో సమానముగా నడుస్తున్నాడు. ఆపళంగా సింహాద్రిరావు ముందడుగు వెయ్యడం మానివేశాడు. "నువ్వు నన్ను ఏ పెద్దపులికో అప్పజెప్పాలని చూస్తున్నావు. నువ్వు నీ స్థలం తప్పితే నేను ఒక్క అడుగేనా పెట్టను. చూశావో లేదో" అన్నాడు. ఆ ఉపాధ్యాయుడు తన స్థలంలోనే నడుస్తానని హామీ ఇచ్చాడు. "మీరందరు నేను చెప్పినట్లుగా కనక నడచుకోకపోతే మిమ్మల్ని అందరినీ మీ ఇనస్పెక్టరుతో చెప్పి డిస్‌మిస్ చేయించేస్తాను. కబడ్దార్!" అని బెదరించాడు. ఈ వెర్రివాడు తమమీద ఏమి నేరాలు చెప్తాడో అని వాళ్లు జడిశారు

మూడువంతుల దారి ముగిసింది. రెండో ఉపాధ్యాయుడు నేలమీద అడుగుల జాడ జూసి అనుమానపడి "ఈ దారినే అప్పుడప్పుడు పెద్దపులి వెళుతూంటుందని చెప్పుకొంటారండి" అన్నాడు.

"హా! చచ్చాను! నా గతేమి! మీరు ఇక్కడివాళ్లేకాబట్టి మీ కిటువంటి కర్మాలు తప్పవుగాని నా కేమి గతి దేవుడా! ఈరోజు ఎలాగు సాయంత్రమవుతుంది! నేను మళ్ళీ ప్రజలలో ఎలాగు పడతాను! ఏమిటి దారి భగవంతుడా!" అన్నాడు సింహాద్రిరావు.

అతని భయం చూసి ఉపాధ్యాయులు "మీ ప్రాణానికి మేం పూచీ ఇస్తాం" అన్నారు. సింహాద్రిరావు ధైర్యంగా ముందడుగులు వేశాడు.

కొమ్మలు బాగా పెరిగిన దుప్పి ఒకటి దారిలో ఎదురయింది.

"అదగో!" అన్నాడు ఉపాధ్యాయుడు.

సింహాద్రిరావు దానిని చూసి, గొడుగు అక్కడ పారవేసి "అరే పెద్దపులి! అరే పెదపులి! మీద పడింది! మీద పడింది!" అని కేకలు వేస్తూ, వెనక్కి పరుగు పుచ్చుకొన్నాడు.

"దుప్పయ్యో! దుప్పయ్యో! దుప్పయ్యో!" అంటూ మేష్టర్లు అతని వెంట పడ్డారు. వాళ్లలో ఒకడు గొడుగు ఎత్తుకొన్నాడు. చిట్టచివరికి అతన్ని పట్టుకొన్నారు.

"నేను నమ్మను" అంటాడు సింహాద్రిరావు.

"మేం చూశాం. మాకు తెలుసు" అన్నారు ఉపాధ్యాయులు.

"అబ్బెబ్బే! మిమ్మల్ని ఎవరు నమ్మమని చెప్పాడయ్యా! నిష్కారణంగా ఈ ఒక్క బ్రాహ్మణ్ణి మీరు పెద్దపులినోట్లో పడెయ్యదలచుకున్నారు. నా కేమి సాధనం!" అని కళ్లు చేతులతో గట్టిగా మూసుకొన్నాడు. కాళ్లు నిలబడకపోగా కూలపడ్డాడు.

ఉపాధ్యాయులు బతిమాలుకొన్నారుగాని లేవడు. చేతుల మూత తీయడు.

"నన్ను మీ ఇనస్పెక్టరుగారికి అప్పజెప్పడం పూచీ మీది. అతన్ని నమ్మించి, పైగా నన్ను నమ్మించీ, మీరు ఈదారిని తీసుకొనివస్తున్నారు. నేనయితే ఈ పెద్దపులి వచ్చేదారిని వస్తానా! ఎన్నటికీ రాను! కావలిస్తే అడివికి అడ్డపడి వెళతాను కాని!" అన్నాడు సింహాద్రిరావు, రెండు చేతులతో కళ్లు మూసుకొని ఉండే!

"జంతువులు రాత్రి తిరుగుతాయికాని పగలు తిరగవు బాబూ!" అన్నాడు రెండో మేష్టరు

"నేనిక ఈ ప్రపంచాన్ని చూడను" అని "ఓ అమ్మా! ఓ నాయనా! మీరు నాకు దూరమయిపోయారా! మిమ్మల్ని ఎప్పుడు చూస్తాను!" అంటూ కళ్లొత్తుకొన్నాడు.

పంతుళ్ల మనస్సులు కరిగిపోయాయి.

"ఊరుదగ్గరికి వచ్చేశామండి పంతులుగారూ!" అన్నాడు నాలుగో మాష్టరు.

అతను వినిపించుకోలేదు. చివరికి వాళ్లు అతనిని లేవదీసి బుజాలమీద కూర్చోబెట్టుకొని మోసుకుపోదాం అని ఆలోచించుకొంటుండగా, మొదటి మేష్టరు "మీరేనా తుపాకితో శరభమృగాన్ని కాల్చేసిన పెద్దమనుష్యులు!" అన్నాడు.

"కాకేం!" అని కళ్లు విప్పాడు సింహాద్రిరావు

"ఎప్పుడండి?" అన్నాడు రెండో మేష్టరు.

"అదంతా చిన్నప్పుడు. ఇప్పుడైనా సరే చేతిలో తుపాకి ఉందంటే ఈ అడివికి నేనే రాజుని. ఈ వెధవఅడివికి జడుస్తానా! ఇదొక అడివా! ఇంకా మళ్లీ తిరుగుందా!" అన్నాడు సింహాద్రిరావు.

రెండో మేష్టరు తన చేతిలో ఉన్న కర్ర అతనికి అందించాడు. "ఇదే తుపాకి అనుకోండి. ఇప్పుడు నడవండి, చూద్దాం" అన్నాడు.

ఆ కర్ర తీసుకొన్నాడు సింహాద్రిరావు. "తుపాకి బుజంమీద వేసుకొని ఎలాగు నడుస్తారో చూపించమన్నావా?" అంటూ, కర్ర నానుకొని లేచాడు. ఆ కర్ర బుజం మీద వేసుకొన్నాడు. గంభీరంగా సిపాయిలాగ గబగబ నడక సాగించాడు. ఇదే బాగుందని అతనివెంట ఉపాధ్యాయులు కూడా పరుగెత్తారు. మనస్సులలో నవ్వుకొన్నారు.

ఇంతటిలో ఊరుదర్శనమయింది. బతుకు జీవుడా అని సంతోషించారు ఉపాధ్యాయులు. అడివిలోంచి బతికి బైటపడ్డానని సింహాద్రిరావు పొంగిపోయాడు. అందరూ కొండపల్లి చేరుకొన్నారు.

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహపుచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, క్యాటలాగు ఉచితం.

జి. వి. రెడ్డి అండ్ కో., "భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా.